క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పెళ్లికానుకను అందజేస్తున్న సర్పంచ్

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం కొటబైలు పంచాయతీ సాయిబూలపల్లెకు చెందిన నూతన వధూవరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను గ్రామ సర్పంచ్ రెడ్డెమ్మ అందించారు. ఆదివారం పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు ఈ కానుకను అందించారు. పట్టువస్త్రాలు, నల్లపూసల దండ, మెట్టెలు, స్వీట్ బాక్సు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు హేమేంద్రరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకున్న జస్టిస్ ఏవీ శేషసాయి

తిరుచానూరు(చంద్రగిరి): శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఏఈఓ రమేష్ స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను సత్కరించారు.

డయల్ యువర్ కమిషనర్, స్పందన రద్దు

తిరుపతి తుడా: నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను సోమవారం రద్దు చేస్తున్నట్లు కమిషనర్ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పర్వదినం కావడంతో ప్రభుత్వం సెలవు ప్రకటించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

సంగీత మహోత్సవాలకు తరలిరండి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న వాయిద్య కళాకారులు

తిరుచానూరు (చంద్రగిరి): శ్రీసద్గురు త్యాగరాజ స్వామివారి సంగీత మహోత్సవాలకు వాయిద్య కళాకారులు తరలి రావాలని తిరుపతి వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం పిలుపునిచ్చారు. తిరుపతి వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జనవరి 6, 7 తేదీలలో తిరుపతిలో నిర్వహించనున్న త్యాగరాజ ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను ఆదివారం తిరుచానూరులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అవిలాల మునస్వామి, మునిరాజా, మీరయ్య, బాలకృష్ణ ప్రసాద్ తదితర వాయిద్య కళాకారులు పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు



భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన శ్రీతిరుపతి గంగమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి వేకువ జామున అభిషేకం, అర్చనలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు రాగిజావ పంపిణీ చేశారు.

రైల్ సేవా పురస్కారం ప్రదానం



విశిష్ట రైల్ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న నాగేశ్వరరావు

తిరుపతి(అలిపిరి): గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని తిరుపతికి చెందిన చెందిన నాగేశ్వరరావు శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ చేతుల మీదుగా విశిష్ట రైల్ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈయన విధుల నిర్వహణపై చిత్తశుద్ధి.. కష్టపడి పనిచేసే తత్వం.. అంకిత భావంతో తిరుపతిలో ప్రయాణికుల టిక్కెట్ల వ్యవస్థకు అంతరాయాలు లేకుండా చూసుకోవడంలో కీలక పాత్ర పోషించారు. దీన్ని గుర్తించిన అధికారులు నాగేశ్వరరావుకు పురస్కారం అందించారు.

తిరుపతి సమగ్రాభివృద్ధే లక్ష్యం



చెన్నారెడ్డి కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగర సమూల అభివృద్ధే తమ లక్ష్యమని నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. చెన్నారెడ్డి కాలనీ–ఇస్కాన్ రోడ్డును కలుపుతూ నిర్మిస్తున్న స్లిప్ వే రోడ్డు, కొంక చెన్నైగుంట ప్రాంతంలో అభివృద్ధి చేస్తున్న 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు అభివృద్ధి పనులను ఆదివారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నగర నల్ల దిక్కులు సమాంతరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో నాలుగు రోడ్లు అభివృద్ధి చేసి తిరుపతి అంతా అభివృద్ధి అయిపోయిందని డప్పు కొట్టుకున్నారని విమర్శించారు. తాము అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తున్నామని తెలిపారు. పదుల సంఖ్యలో మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఇంటర్నల్, లింక్ రోడ్లను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. రాబోయే రోజుల్లో నగర విస్తరణతో తిరుపతి రూపు రేఖలు మారబోతున్నాయని చెప్పారు. మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణారెడ్డి, డీఈ శ్రావణి, కార్పొరేటర్లు పునీతమ్మ, ముని రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బొగ్గుల వెంకటేశ్వర్లు, అరుణ్ కుమార్, శ్యామల, చందు రాయల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి తుడా చైర్మన్ భరోసా



రూ.1.20 లక్షల చెక్కును బాధితుడికి అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- రూ.1.20 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసిన తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా సప్తగిరికాలనీ పంచాయతీలోని అంబేద్కర్ కాలనీకి చెందిన చంద్రమౌళికి రూ.1.20 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేశారు. ఆదివారం తుమ్మలగుంట తుడా చైర్మన్ నివాసం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఆపదలో ఆపద్బాంధవుడుగా నిలిచారని ఈ సందర్భంగా చెక్కును అందుకున్న బాధితుడు చంద్రమౌళి తుడా చైర్మన్ మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రాణాంతకమైన అనారోగ్యం బాధిస్తుంటే.. మెరుగైన వైద్య సేవలకు అప్పు చేసి మరీ వైద్యం చేయించుకున్నానని బాధితుడు చంద్రమౌళి వాపోయారు. చేసిన అప్పు తీర్చేందుకు ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆపదలో రూ.1.20 లక్షలు రావడం సంతోషంగా ఉందని చంద్రమౌళి పేర్కొన్నారు. సప్తగిరి కాలనీ ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి వజ్రాయుధం సోషల్ మీడియా



గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: వైఎస్సార్ సీపీకి వజ్రాయుధం సోషల్ మీడియా అని, భవిష్యత్తు సోషియల్ మీడియాదేనని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కారదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తుమ్మలగుంటలో చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు గుర్తింపు కార్డులను అందజేశారు. వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా విస్తృత ప్రచారం సాగించాలని కోరారు. చంద్రగిరిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను, ప్రజలకు అందజేసిన సంక్షేమాన్ని సామాజిక మాధ్యమాలు వేదికగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. గుర్తింపు కార్డులు అందుకున్న వారిలో తిరుపతి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బాలిశెట్టి కిషోర్, కో–కన్వీనర్ మైలాం శ్రీకాంత్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ సెంథిల్‌కుమార్, కో–కన్వీనర్లు చరణ్ తేజ, వంశీ, రాజేష్, మండల కన్వీనర్లు కోటియాదవ్, ముక్కోటి, నవీన్, జయప్రకాష్ రెడ్డి, కో–కన్వీనర్లు పాల్గొన్నారు.

చిన్మయ మిషన్‌లో వైకుంఠ ఏకాదశి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలోని యడమవారిపల్లెలోని చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు స్వామి శ్రీకృపానంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం చిన్మయ మిషన్‌లో భగవద్గీతా జయంతి, వైకుంఠ ఏకాదశి, తపోవన్ స్వామి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అన్నదానం, భగవద్గీత పుస్తక దానం కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యడమవారిపల్లె, పులిచెర్ల, పీలేరు మండలాలకు చెందిన చిన్మయ మిషన్ కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో చక్రస్నానం



చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం



ఆలయ పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ద్వాదశి పురస్కరించుకుని శాస్త్రోక్తంగా చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహించారు. ముందుగా తెల్లవారుజామున శ్రీవారిని తిరుప్పావై సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. ఆదివారం కూడా పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని, ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయంలోని చక్రతాళ్వార్ ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. అక్కడ అర్చకులు వైఖానస ఆగమోక్తంగా చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించారు. తదుపరి స్వామివారికి పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన



చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

తిరుపతి కల్చరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించి చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన లభించింది. రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామిసుకృతానంద మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ, పీజీ కళాశాల స్థాయి విద్యార్థులకు స్వామి వివేకానంద జీవిత సంఘటనలు, స్వామి వివేకానంద సందేశం, దేశాన్ని పునర్నిర్మించండి అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు చేపడుతున్నట్లు తెలిపారు. విజేతలకు స్వామి వివేకానంద జయంతి రోజైన జనవరి 12వ తేదీన ఆశ్రమంలో నిర్వహించే కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం

తిరుపతి లీగల్: వినియోగదారుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు ఏ.పార్థసారథి తెలిపారు. ఆదివారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వినియోగదారుల కమిషన్ హాల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కామర్స్–డిజిటల్ వ్యాపారం అనే అంశంపై ఈ కార్యక్రమంలో చర్చ చేపట్టారు. వినియోగదారుల కమిషన్ మహిళా సభ్యురాలు స్నేహలత, తిరుపతి వినియోగదారుల కౌన్సిల్ సభ్యులు పి.అమర్నాథ్, ఆర్ఎస్.చంద్రశేఖర్, విద్యార్థులు సైమన్, సాయి చరన్, అనుదీప్, సాయి దీక్షిత, వ్యాయవాది గురుప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ పాఠశాల, భారతీయ విద్యాభవన్, చిత్తూరు పేటమెట్టకు చెందిన మంగళ్ విద్యాలయ, ఏఈఎస్.విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడుదాం.. ఆంధ్రా ప్రదర్శన

విజయవంతం



ఆడుదాం ఆంధ్ర ర్యాలీ

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున నిర్వహించనున్న ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ఆదివారం తిరుపతిలో నిర్వహించిన భారీ ప్రదర్శన విజయవంతమైంది. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి టౌన్‌క్లబ్ సర్కిల్ వరకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీఓ) సయ్యద్ సాహెబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామ, వార్డు స్థాయిల్లోని క్రీడాకారులను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు ఇది చక్కని వేదిక అని తెలిపారు. డీఈఓ డాక్టర్ వి.శేఖర్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి విజయకుమారి, జెన్ స్పోర్ట్స్ అకాడమీ కిరణ్, శాప్ కోచ్‌లు చక్రవర్తి, గోపి, వినోద్, లక్ష్మీ కిరణ్, శశి, హిందూజ, నీలిమ, ప్రేమ, వినోద్, వైఎస్సార్ సీపీ నాయకులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, దొడ్డా సిద్దారెడ్డి, ఎస్‌కే.బాబు, రాజేంద్ర, సాయికుమారి, పునీత, పుష్ప, లతయాదవ్, మల్లం రవి పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్‌లో స్పార్క్ పోటీలు



బహుమతులందజేస్తున్న కళాశాల యాజమాన్యం

తిరుపతి సిటీ: ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు స్పార్క్–2023 పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆ కళాశాల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ విచ్చేశారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రతి ఏడాది స్పార్క్ పోటీలను విధిగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వీడియో ప్రజెంటేషన్, గ్రూప్ డిస్కషన్స్, ఎక్స్‌టెంపర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో స్పార్క్ ఆఫ్ ది ఇయర్‌గా గుల్ సమర్ అనే విద్యార్థి ప్రథమ స్థానంలో నిలిచి 5వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. ద్వితీయ స్థానంలో నదియా 3వేలు, తృతీయ స్థానం ఫాహద్ అలీ 2వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. ఉపసంచాలకులు మునిరత్నం, ప్రిన్సిపల్ మదనమోహన్, జాషువా, భానుకిరణ్, పాల్ సుధాకర్, జానకీరామ్, శ్రీనివాసులు, పార్థసారథి, నాదముని, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలలో ఎస్‌డీహెచ్‌ఆర్ విజయభేరి



డిస్టింక్షన్లు సాధించిన ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యార్థులు

తిరుపతి సిటీ: న్యూబాలజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్వీయూ ఆదివారం విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలలో 373 డిస్టింక్షన్లు సాధించారని ప్రిన్సిపల్ ఉషా తెలిపారు. గణిత, స్టాటిస్టిక్స్ విభాగాలలో 22మంది 10జీపీఏ సాధించారని పేర్కొన్నారు. ఎంఎస్‌సీఎస్ గ్రూప్‌లో దీపిక 9.53 సాధించగా, గ్రీష్మ 9.28, ఎఫ్ఎస్‌టీలో చందన 9.41, బీకాం గ్రూప్‌లో వర్ష 9.23, బీసీఏలో ఎస్.వర్ష 9.20, సరస్వతి 8.89, సింధు 8.40, లోకేశ్వరి 7.63, బీసీసీఏ గ్రూప్‌లో యశ్వంత్ 9.19, ఎంపీసీఎస్‌లో మమత 9.05, బీబీఏ గ్రూప్‌లో షాలినీ, 8.96 జీపీఏ సాధించారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి అభినందించారు.

కనుల పండువగా చక్రస్నానం



పద్మసరోవరంలో చక్రస్నానం   పుష్కరిణిలో స్నానమాచరిస్తున్న భక్తులు

తిరుచానూరు(చంద్రగిరి): ముక్కోటి ద్వాదశి సందర్భంగా తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ద్వాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవ తో మేల్కొలిపారు. అమ్మవారికి అభిషేక సేవను నిర్వహించి, శోభాయమానంగా అలంకరణ గావించారు. అనంతరం అమ్మవారి దివ్య మంగళ దర్శన భాగ్యాన్ని భక్తాదులకు కల్పించారు. తదుపరి ఆలయంలోని సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలను నిర్వహించి, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పద్మసరోవరానికి వేంచేపు చేశారు. అక్కడ అర్చకులు పాంచరాత్ర ఆగమోక్తంగా చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజన కార్యక్రమా న్ని నిర్వహించారు. అనంతరం దివ్య ముహూర్తంలో సుదర్శన చక్రానికి చక్రస్నాన ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పుష్కరిణి వద్దకు చేరుకుని పుణ్యస్నానాలను చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, శ్రీవాణి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీసీసీ విద్యార్థుల ప్రతిభ



హైమావతి, సునీల్ కుమార్, పల్లవి

తిరుపతి సిటీ: బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆదివారం ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలలో అత్యున్నత ప్రతిభ కనబరిచి డిస్టింక్షన్ సాధించారని ప్రిన్సిపల్ ఎ.నాగరాజ తెలిపారు. బీకాం కంప్యూటర్స్‌లో ఎం హైమావతి 8.65 శాతం సాధించగా వి.సునీల్ కుమార్ 8.45, ఎస్ సౌమ్య 8.37 శాతం సాధించారని తెలిపారు. బీఎస్సీలో పి.పల్లవి 7.34 శాతం, లక్ష్మీపతి 6.75, సుజాత 5.15శాతం మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు అధ్యాపకులు, యాజమాన్యం అభినందనలు తెలిపారు.

క్రిస్మస్ వేడుకలకు శ్రీకారం





ఆర్‌సీఎం చర్చిలో అలంకరణ, సీఎస్ఐలో క్యాండిల్ సర్వీస్‌లో పాస్టర్ ప్రేమ్‌కుమార్

పాకాల: రక్షకుడు ఉదయించినాడట అని కీర్తనలతో చర్చిలలో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలకు శ్రీకారం చుట్టారు. సోమవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం, అర్ధరాత్రి వరకు సీఎస్ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చి, కార్నర్‌స్టోన్, ఆదాము మందిరం, ఎబ్రోన్ మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెవరెండ్ ప్రేమ్‌కుమార్ (సీఎస్ఐ చర్చి), ఫాదర్ ఆంథోనిరాజ్(ఆర్‌సీఎం చర్చి)లలో క్రిస్మస్ సందేశం ఇచ్చారు. మిరిమిట్లు గొలిపే కాంతులతో చర్చిలను సుందరంగా అలంకరించారు. సోమవారం స్థానిక చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు పేర్కొన్నారు. పేదలకు అన్నదానం, వస్త్రదానాలు చేయనున్నట్లు వివరించారు.

అనారోగ్యంతో సీనియర్ పాత్రికేయుడి మృతి

పాకాల: సీనియర్ పాత్రికేయుడు దిలీప్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదివారం కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దిలీప్‌కుమార్ వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని వివరించారు. ఈయనకు భార్య శిరీష, కుమారుడు అభిజిత్ ఉన్నారు.

మంచి వ్యాపకం ఆరోగ్యకరం



సామాజిక సేవా పురస్కారం అందుకుంటున్న పాములు పట్టే భాస్కర్ నాయుడు

తిరుపతి కల్చరల్: మంచి వ్యాపకాన్ని పెట్టుకోవడం ద్వారా మానసిక ఆరోగ్యం చేకూరుతుందని ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ నామిని సుబ్రమణ్యం నాయుడు తెలిపారు. ధర్మయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నామిని ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంఘ సేవకురాలు జి.సుజాత విశిష్ట అతిథిగా విచ్చేశారు. అనంతరం రచయితలు అడిగోపుల వెంకటరత్నం, తిరువాయిపాటి రాజగోపాల్, వి.ప్రతిమలకు సాహితీ పురస్కారాలు అందజేశారు. ఉదయ్‌కుమార్, ఆదిశేషు, ఎం.ప్రసాద్‌లకు పాత్రికేయ పురస్కారాలు, పాములు పట్టే భాస్కర్ నాయుడికి సామాజిక సేవా పురస్కారం, ముంగర శశిధర్‌రాజుకు, భాషాసేవా పురస్కారం, తిరుపతి కిరణ్‌కు సాహిత్య సేవా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ధర్మయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.ధర్మయ్య, కళాకారులు బొందు రామచంద్రారెడ్డి, శాంబోలు హరి, విజయకుమార్, కళా సేవకుడు బీఎస్.రెడ్డి, సాకం నాగరాజు, గార్లపాటి దామోదర్ నాయుడు, గంగవరం శ్రీదేవి, టింకాయల దామోదరం, కోటేశ్వరరావు, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, వాకా ప్రసాద్, ఎం.చంద్రారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారుల నృత్యం

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సుజేందర్ బాబు బృందం ఆధ్వర్యంలో సౌత్‌జోన్ కల్చరల్ ఫెస్ట్–2023 నిర్వహించిన భరతనాట్యం, కూచిపూడి అలరించాయి. తిరుపతికి చెందిన చార్మిత సిన్హా, బెంగళూరుకు చెందిన మధుశ్రీ, బెంగళూరులోని చెన్నపట్నంకు చెందిన అనన్య, చెంగల్పట్టుకు చెందిన రాజేష్ బృందాలు భరతనాట్యం, హైదరాబాద్ గంగూరు డ్యాన్స్ అకాడమీ, తిరుపతికి చెందిన వరలక్ష్మీ బృందాలు కూచిపూడి, హైదరాబాద్‌కు చెందిన మందిరా బృందం జానపద నృత్యాలు, హోస్కోటకు చెందిన శిల్ప బృందాల జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.